بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحْمَدُهٗ وَنُصَلِّيْ عَلٰى رَسُوْلِهِ الْكَرِيْمِ وَعَلٰى عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْدِ

**Summary of Friday Sermon Hazrat Khalifatul Masih V 19.01.2024 (Telugu)**

# ఉహద్ యుద్ధ పరిస్థితులు, సంఘటనల ప్రస్తావన
# పాలస్తీనీయుల కొరకు మరల దుఆ పిలుపు

హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 19.01. 2024 తేదీన - మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, లండన్, ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము

أَشْهَدُ أَنْ لَا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ۔
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ۔ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ۔ الرَّحْمٰنِ الرَّحِيْمِ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ۔ إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِيْنُ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ۔ صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّالِّيْنَ۔

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించిరి. ఉహద్ యుద్ధం గురించి ప్రస్తావన జరుగుతుండెను. దీని గురించి మరి కొన్ని వివరాలను నేడు ప్రస్తావింతును. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అమరులైనారని శత్రువు ప్రకటించినట్లు ఇంతకుముందు ప్రస్తావించబడెను. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అమరులైన వార్త ఒక వ్యక్తి ప్రకటించెను. ముస్లింలు ఈ వార్త విన్నప్పుడు వారి పరిస్థితి ఎలా మారింది. దీని వివరాలు ఇట్లు ప్రస్తావించబడెను. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను హతమార్చితినని ఇబ్నె ఖమిఅ భావించినప్పుడు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అమరులైనారని అతడు ప్రకటించెను. షైతాన్ ప్రకటించెనని కూడ చెప్తుంటారు. ఎవరు ప్రకటించారనే విషయం గురించి అనేక కథనాలు గలవు. వివిధ వ్యక్తులు ప్రకటన చేసి ఉండవచ్చును లేదా షైతానీ స్వభావికుడైన ఒక వ్యక్తి కూడ ఈ ప్రకటన చేసి ఉండవచ్చును.

సీరత్ ఖాతమున్నబియ్యీన్ అనే పుస్తకంలో హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ (రజి) గారిట్లు వ్రాశారు. అప్పుడు ముస్లింలు మూడు వర్గాలలో విడిపోయిరి. ఒక వర్గం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అమరులైన విషయం విని రణరంగం నుండి పారిపోయెను. వారిలో హజ్రత్ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజి) కూడ ఉండిరి. కాని అప్పటి ప్రత్యేక పరిస్థితుల వలన మరియు ప్రజల హృదయపూర్వక విశ్వాసం, వినమ్రత దృష్ట్యా అల్లాహ్ తఆలా వారిని క్షమించెనని పవిత్ర ఖుర్‌ఆన్‌లో తెలుపబడెను. వారిలోని కొందరు మదీనా వరకు చేరుకొనిరి. తద్వారా అక్కడ కూడ మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కల్పిత అమరత్వ మరియు ఇస్లాం సైన్యం ఓడిపోయిన వార్త చేరినది. దీని వలన నగరమంతా విషాదం అలుముకున్నది. ముస్లిం పురుషులు, మహిళలు, పిల్లలు మరియు వృద్ధులు ఉహద్ వైపు బయలు దేరిరి. కొందరు పరుగెత్తుకొంటూ రణ రంగంనకు చేరుకొని, అల్లాహ్ పేరుతో శత్రువుల వరుసలలో దూసుకెళ్లిరి. ఇక రెండవ వర్గం మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అమరులైన వార్త విని ఇక యుద్ధం చేయుట నిష్ప్రయోజనమని భావిస్తు ప్రక్కకు జరిగి తల వంచుకొని కూర్చొనెను. మూడవ వర్గం ఇంకా నిరంతరం పోరాడుతూనే ఉండెను. వీరిలోని కొందరు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చుట్టు గుమికూడి

వీరోచితంగా యుద్ధం చేస్తుండిరి. అధిక ప్రజలు రణరంగంలో విడి విడిగా యుద్ధం చేస్తుండిరి. వీరికి మరియు రెండవ వర్గ అనుచరులకు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జీవించి ఉన్న విషయం తెలిసిన కొద్ది పిచ్చి పిచ్చిగా యుద్ధం చేస్తూ వారి స.అ.స. చుట్టు చేరుతుండిరి. అప్పుడు యుద్ధం ఎలా జరుగుతుండెననగా ఖురైష్ సైన్యం సముద్ర భీకర అలల వలె నలు వైపుల నుండి దూసుకొస్తుండెను. రణరంగంలో నలు వైపుల నుండి బాణాలు, రాళ్ల వర్షం కురుస్తుండెను. త్యాగధనులు ఈ ప్రమాద స్థితిని గమనించి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చుట్టు వలయకారంలో వారి స.అ.స. పవిత్ర శరీరంను తమ శరీరాలతో దాచుకొనిరి. అయినను ఒక్కోసారి దాడులు తీవ్రమైనప్పుడు ఈ కొద్ది మంది అటు ఇటు నెట్టి వేయబడేవారు. అప్పుడు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం దాదాపు ఒంటరిగా మిగిలిపోయేవారు.

ఇటువంటి ఒక సందర్భంన హజ్రత్ సాద్ బిన్ అబీ వఖ్ఖాస్ (రజి) అన్యారాధకుడైన సోదరుడు అత్బ బిన్ అబీ వఖ్ఖాస్ విసిరిన ఒక రాయి వారి స.అ.స. పవిత్ర ముఖంనకు తగిలినది. తద్వారా వారి స.అ.స. ఒక దంతం విరిగి ఒక పెదవి కూడ గాయపడెను. అబ్దుల్లాహ్ బిన్ షహాబ్ విసిరిన మరో రాయి వారి స.అ.స. నుదుటిని గాయపర్చెను. కొంత సమయం తర్వాత మూడవ రాయి ఇబ్నె ఖమిఅ విసరగా అది వచ్చి వారి పవిత్ర చెంపకు తాకింది. తద్వారా వారి స.అ.స. తల రక్షణ కవచపు రెండు శిలలు వారి స.అ.స. చెంపలో గుజ్జుకొని అట్లే ఉండిపోయినవి.

దుఆ ఆమోద తత్వంను తెలుపుతు హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి) ఉహద్ సంఘటనను కూడ ఎంతో వివరంగా ప్రస్తావించారు. వారు (రజి) ఇట్లనిరి. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను బంధించుటకు ఈరాన్ చక్రవర్తి సంకల్పించెను. బంధించేవారు ఇంకా రాక ముందే అనగా ఆ వ్యక్తులు సందేశం తీసుకొని యెమెన్ గవర్నర్ వద్దకు చేరుకొనిరి. అల్లాహ్ తఆలా ఆ చక్రవర్తి కుమారుణ్ణి సిద్ధం చేయగా అతడు తన తండ్రిని హతమార్చెను. కాని ఉహద్ యుద్ధంలో శత్రువు వారి స.అ.స.పై దాడి చేసెను, రాళ్లు విసిరెను, వారి స.అ.స. దంతాలు విరిగెను, తలకు గాయమయ్యెను, తల కవచపు శిలలు తలకు గుజ్జుకొనెను, వారు స.అ.స. స్పృహ తప్పి పడిపోయిరి, వారు స.అ.స. అమరులైనారని భావించబడెను. వారి స.అ.స. గౌరవం ఇష్టముండి అల్లాహ్ తఆలా ఈరాన్ చక్రవర్తిని అంత దూరంలోనే చంపివేసినప్పుడు ఉహద్ మైదానంలో రాళ్లు విసిరే అవకాశం అవిశ్వాసులకు ఎందుకిచ్చాడు? అని ఎవరైనా అనవచ్చును. కాని ఈ విమర్శలు సరికావు. ఇవి అల్లాహ్ తఆలా వివేకంతో కూడిన పనులు. ఇవి రహస్యాలు. కొన్ని సందర్భాలలో అతడు చిన్న విషయంలోనే పట్టుకుంటాడు, మరి కొన్ని సార్లు వివేకంతో వెసులుబాటు కల్పిస్తాడు. తద్వారా మానవుని నిస్సహాయత, అచేతనం బహిర్గతమగుతుంది.

మొత్తంమీద ఈ సంఘటన నడుస్తున్నది. హత్య అపోహాలు వ్యాపించిన తర్వాత దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను అనుచరులు అకస్మాత్తుగా చూశారు. దీని వివరాలిట్లు వ్రాసి ఉన్నవి. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సజీవంగా సురక్షితంగా ఉన్నారని చూసిన మొట్టమొదటి వ్యక్తి హజ్రత్ అబూఉబైదహ్ (రజి). హజ్రత్ అబూఉబైదహ్ (రజి) ఇట్లనిరి. నేను దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను వారి కండ్ల ద్వారా గుర్తు పట్టాను. అవి తల రక్షణ కవచం క్రింద బాగా మెరుస్తుండెను.

ముస్లింలకు ఈ విషయం తెలిసిన కొద్దీ అందరు వారి స.అ.స. చుట్టు చేరిరి. ముస్లింలందరు వారి స.అ.స.ను చూసి గుర్తు పట్టగా వారు వారి స.అ.స. చుట్టు దీపపు పురుగుల వలె గుమికూడిరి. హ'జ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ (రజి) ఇట్లు వ్రాసిరి. ఖురైష్‌లు కొంచెం వెనక్కి జరిగినప్పుడు మైదానంలో ఉన్న ముస్లింలు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను గుర్తు పట్టి వారి స.అ.స. చుట్ట గుమికూడిరి. అప్పుడు వారు స.అ.స. ఆయా అనుచరుల గుంపులో నెమ్మ నెమ్మదిగా పర్వతమెక్కి పైన ఒక సురక్షిత ప్రాంతంనకు చేరుకొనిరి. మార్గంలో మక్కాలోని ఒక నాయకుడు ఉబై బిన్ ఖల్ఫ్ వారి స.అ.స.ను చూడగా అతడు ఆగ్రహం, శత్రుత్వంతో అంధుడై ఇట్లు అరుస్తు వారి స.అ.స. వైపు పరుగెత్తెను. **"లా నజౌతు ఇన్నజా"** అనగా ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం బ్రతికి పోయినచో నేనెట్టి పరిస్థితిలో బ్రతకలేను. అనుచరులు అతణ్ని నిలువరించదలచిరి. కాని మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. అతణ్ణి విడిచి పెట్టండి, నా దగ్గరకు రానివ్వండి. అతడు వారి స.అ.స.పై దాడి చేయు సంకల్పంతో దగ్గరికి వచ్చినప్పుడు వారు స.అ.స. ఒక బర్ఛీ తీసుకొని అతనిపై దాడి చేసిరి. తద్వారా అతడు తల తిరిగి నేలపై పడిపోయెను. అనంతరం అతడు లేచి అరుస్తు, మొత్తుకొంటూ పారిపోయెను. గాయం అంత పెద్దగా లేకున్నను మక్కాకు చేరక ముందే అతడు మట్టిలో కలిసిపోయెను.

మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సురక్షిత ప్రాంతానికి చేరుకున్నప్పుడు ఖురైష్‌లోని ఒక సైనిక భాగం ఖాలిద్ బిన్ వలీద్ నాయకత్వంలో పర్వతంపైకి ఎక్కి దాడి చేయదలచెను. కాని మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశంతో కొందరు ముహాజిర్లను తీసుకొని హ'జ్రత్ ఉమర్ (రజి) దానిని ఎదురించి, దానిని ఓడించెను. మరొక కథనంలో ఇట్లు గలదు. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పర్వతమెక్కుటకు సంకల్పించినప్పుడు తల నుండి రక్తం ప్రవహించినందున, బలహీనత వలన వారికి శక్తి లేకుండెను. దీనిని చూసి హ'జ్రత్ తల్హా బిన్ ఉబైదుల్లాహ్ (రజి) వారి స.అ.స.ను తమ భుజాలపై కూర్చోబెట్టుకొని పర్వతం పైకి తీసుకెళ్లిరి. వారు స.అ.స. వెంటనే ఇట్లనిరి. వీరు తప్పక స్వర్గంలో ప్రవేశింతురు. హ'జ్రత్ ఆయిషా (రజి) ఇట్లు ఉల్లేఖించారు. ఉహద్ యుద్ధం గురించి హ'జ్రత్ అబూబకర్ (రజి) మాట్లాడినప్పుడు ఆ రోజు మొత్తం తల్హా (రజి)కు అంకితమని అనేవారు.

ఉహద్ యుద్ధంలో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు తగిలిన గాయాల గురించి బుఖారిలో ఇట్లు కథనం గలదు. హ'జ్రత్ ఫాతిమా (రజి) గాయాలను కడుగుతుండగా హ'జ్రత్ అలీ (రజి) తొట్టి నుండి నీళ్లు పోస్తుండిరి. నీళ్ల వలన రక్తం మరింత వస్తుందని గమనించిన ఫాతిమా (రజి) ఒక బస్తను కాల్చి దానిని అతికించిరి. తద్వారా రకం ఆగిపోయినది. వారు సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. తన ప్రవక్తను గాయపర్చి, అతని ముందటి దంతాలను విరగ్గొట్టిన జాతి ఎలా సఫలమగుతుంది? అతడు వారిని అల్లాహ్ వైపే పిలుస్తుండెను.

మిగతా విషయాలు తర్వాత ప్రస్తావించబడునని హుజూర్ తెలిపిరి.

పాలస్తీనా కొరకు దుఆల పిలుపునిస్తు హుజూరె అన్వర్ ఇట్లనిరి. పాలస్తీనా కొరకు దుఆ చేయాలని నేను చెప్తుంటాను. ముస్లిం దేశాల పరిస్థితి ఎలా తయారైనదనగా అందరు ఏకమై పాలస్తీనాను రక్షించుటకు చింతించే బదులు స్వయంగా ముసింలే పరస్పరం కోట్లాడుకోవడం మొదలు పెట్టారు.

పాకిస్తాన్ ఈరాన్ మధ్య కూడ వివాదం తలెత్తినదని వినబడుతుంది. ఒకరు మరొకరిపై బాంబులు కూడ విసురుకున్నారట. ఇప్పుడు ఈ భయంకర పరిస్థితి ఏర్పడుతుంది. అల్లాహ్ తఆలా ఈ ముస్లిం దేశాలకు, నాయకులకు సద్బుద్ధి ప్రసాదించుగాక! వారి కొరకు కూడ దుఆ చేయండి. అల్లాహ్ తఆలా వీరు తమ ఉద్దేశంను వాస్తవంగా అర్థం చేసుకొనుటకు వీరిని అనుగ్రహించుగాక! వీరు ఒక్క సమాజంగా మారుదురు గాక!

ఖుత్బా చివరలో హుజూరె అన్వర్ ఇట్లనిరి. నేను రెండు పరోక్ష అంత్యక్రియ ప్రార్థనలు కూడ చదివింతును. ఒకటి సయ్యద్ మౌల్వీ అహ్మద్ గారు తండ్రి సయ్యద్ దాఊద్ ముజఫ్ఫర్ షాహ్ గారు. వీరు హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి) మరియు సయ్యదహ్ ఉమ్మె తాహిర్ గారల మనవడు. నాకు చిన్నమ్మ వరుస సోదరుడు. నా భార్యకు పెద్ద సోదరుడు.

రెండవ జనాజ ఆక్మీద అగ్ ముహమ్మద్ సదర్ జమాఅత్ మహ్దీ ఆబాద్ మరియు డోరి రీజన్ బుర్కినాఫాసు గారిది. హుజూరె అన్వర్ ఇట్లనిరి. అల్లాహ్ తఆలా వారిని క్షమించి, కరుణించుగాక! వారి సంతానంకు, వారి బంధుమిత్రులకు సహనం, ధైర్యం కలిగించుగాక! వారి సత్కార్యాలను కొనసాగించుటకు వారిని అనుగ్రహించుగాక!

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِیْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَکَّلُ عَلَیْهِ ـ وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَیِّئَاتِ
اَعْمَالِنَا ـ مَنْ یَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ یُّضْلِلْهُ فَلَا هَادِیَ لَهٗ ـ وَنَشْهَدُ اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ
وَرَسُوْلُهٗ ـ عِبَادَ اللّٰهِ رَحِمَکُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ یَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِیْتَآءِ ذِی الْقُرْبٰی وَیَنْهٰی عَنِ الْفَحْشَآءِ وَالْمُنْکَرِ
وَالْبَغْیِ ـ یَعِظُکُمْ لَعَلَّکُمْ تَذَکَّرُوْنَ ـ اُذْکُرُوا اللّٰهَ یَذْکُرْکُمْ وَادْعُوْهُ یَسْتَجِبْ لَکُمْ وَلَذِکْرُ اللّٰهِ اَکْبَرُ ـ

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Incharge Telugu Desk)*